క్లుప్తంగా

ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు




జగ్గయ్యపేటఅర్బన్, నందిగామటౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మొండితోక జగన్ మోహనరావు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లాదీవెనలతో నియోజకవర్గ ప్రజలకు సకలశుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వీరులపాడు:మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ రాజాకిషోర్ తెలిపారు. మండలంలోని జుజ్జూరు, పెద్దాపురం, గూడెంమాధవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆదేశించారు.

అదనపు బోర్లు ఏర్పాటు



నందిగామ: పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు కొత్త మున్నేరు స్కీం, కీసర స్కీముల వద్ద బుధవారం అదనపు బోర్లు ఏర్పాటు చేపట్టారు. ఈ పనులను కమిషనర్ బుధవారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వేసవికాలంలో తాగునీటికి ఇబ్బంది రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తాగునీరు సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నామన్నారు. వేసవి నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలిగితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 9493814856కు సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాసరావు ఉన్నారు.

20గ్రాముల బంగారం చోరీ

చందర్లపాడు(నందిగామ): పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన చందర్లపాడు మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆర్ ధర్మరాజు కథనం మేరకు..చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామానికి చెందిన రంగారావు బుధవారం మధ్యాహ్నం సమయంలో భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి 20 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని సందర్శించడంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

నందిగామ: పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాన్ని నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేయాల్సిన బందోబస్తుపై ఇన్‌స్పెక్టర్ హనీష్‌తో చర్చించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ కె.వి.ఆర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ప్రగతిపథంలో వెల్లంకి

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- మెరుగుపడిన మౌలిక వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వెల్లంకి జెడ్పీ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు



వెల్లంకి సహకార సంఘ భవనం



జీసీకాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్



వెల్లంకి (వీరులపాడు): గత ప్రభుత్వాల హయాంలో పూర్తి నిరాదరణకు గురైన పల్లెలు..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేడు సకలవసతులతో పట్టణాలకు దీటుగా సగర్వంగా నిలుస్తున్నాయి. వీరులపాడు మండలంలోని వెల్లంకి గ్రామమే అందుకు సరైన ఉదాహరణ. గత టీడీపీ పాలకుల పాలనలో కనీసవసతులు సైతం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఈ ఐదేళ్లలో వెల్లంకి గ్రామం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఈ గ్రామాభివృద్ధిపై నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రత్యేకంగా దృష్టి సారించి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఈనిధులతో అనేక అభ్రివృద్ధి పనులు చేపట్టడంతో వెల్లంకి గ్రామంలో మౌలికవసతులు మెరుగుపడ్డాయి.

రూ.1.04కోట్లతో పాఠశాలల అభివృద్ధి..

మనబడి నాడు–నేడు పథకం కింద వెల్లంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.84లక్షలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.20లక్షలు మంజూరయ్యాయి.ఈ నిధులతో పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు విద్యార్థులకు డెస్క్‌లతో కూడిన బల్లలు, గ్రీన్ చార్ట్ బోర్డు, డిజిటల్ తరగతుల కోసం టీవీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం మంచినీరు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఇలా రూ.1.04కోట్లతో ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలస్థాయిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



వెల్లంకిలో నిర్మించిన సిమెంటు రోడ్డు

రూ.40లక్షలతో సచివాలయ నిర్మాణం..

గ్రామ జనాభా 5900 కలదు. గ్రామస్తులకు ఇంటిముంగిటే అన్ని ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో గ్రామసచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా వెల్లంకి గ్రామంలో రూ.40లక్షలతో సచివాలయాన్ని నిర్మించారు. రూ.38లక్షలతో సహకారసంఘ భవన నిర్మాణం పూర్తిచేశారు. గ్రామంలోని 20మంది రైతుల పొలాల్లో వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేశారు.

రూ.50లక్షలతో సిమెంటురోడ్లు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పర్యవేక్షణలో గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో వెల్లంకి రూపురేఖలే మారిపోయాయి. ముఖ్యంగా వెల్లంకిలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.50లక్షలతో సిమెంటురోడ్లు నిర్మించారు. రూ.8లక్షలతో ఆయా కాలనీల్లో బోర్లు ఏర్పాటు చేసి మినీ వాటర్‌ట్యాంకులు, కొళాయిలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలికవసతులు మెరుగుపరిచారు.



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల

76 మందికి ఇళ్లస్థలాలు..

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద గ్రామంలోని 76మంది పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. ఇందుకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.50లక్షలు వెచ్చించి రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇళ్లస్థలాలను అందజేసింది. అదేవిధంగా ఆయా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి రాష్ట్రప్రభుత్వం ఆర్థికసాయం అందించి పేదల సొంతింటి కలను నెరవేర్చింది.

గ్రామస్తులకు రూ.29.23కోట్ల మేర లబ్ధి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలుచేసిన ఆయా పథకాల ద్వారా గ్రామంలోని అర్హులందరికీ మేలు చేకూరింది. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి, రైతుభరోసా, చేయూత తదితర పథకాల ద్వారా డీబీటీ రూపంలో గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.29.23కోట్లను ప్రభుత్వం ఈ ఐదేళ్లలో జమచేసింది. నాన్‌డీబీటీ రూపంలో గ్రామస్తులకు కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూరింది. ఇలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వెల్లంకి గ్రామం మునుపెన్నడూ లేని అభివృద్ధిని సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



వెల్లంకిలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం

నీటి సమస్య పరిష్కారమైంది..



గతంలో గ్రామంలో వాడుక నీటి సమస్య తీవ్రంగా ఉండేది. గతంలో ఎన్నిసార్లు చెప్పినా పాలకులు, అధికారులు స్పందించ లేదు. సమస్యను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు దృష్టికి తీసుకెళ్లగా వాటర్‌ట్యాంక్‌కు నిర్మాణం చేయించి సమస్యను పరిష్కరించారు.

– షేక్ మైబీ, గ్రామస్తురాలు

పాఠశాలల రూపురేఖలు మారాయి..



గతంలో మాగ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులు లేక నానాఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో వసతులు కల్పించారు. పాఠశాలల రేపురేఖలే మారిపోయాయి.

– సత్యనారాయణరెడ్డి, గ్రామస్తుడు

మునుపెన్నడూ లేని అభివృద్ధి..



మాగ్రామంలో సచివాలయం , రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్ ఏర్పాటుతోపాటు ఈ ఐదేళ్లలో మౌలికవసతులు బాగా మెరుగుపడ్డాయి. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంటురోడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామం మునుపెన్నడూలేని అభివృద్ధిని సాధించింది.

– షేక్ హుస్సేన్‌బీఅబీ, సర్పంచి

జగన్ మార్క్ అభివృద్ధి..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాభివృద్ధితోపాటు సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లో కోట్లాది రూపాయలు జమయ్యాయి. దీంతో ప్రజల జీవనప్రమాణాలు పెరిగాయి. ముఖ్యంగా కరోనా సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకుంది.

– వేమిరెడ్డి కోటేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు

మహిళా పోలీసులకు శిక్షణ

నందిగామ: మహిళా పోలీసులకు ఎన్నికల విధులపై బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ శివారులోని ఓ కల్యాణ మండపంలో మహిళా పోలీస్ సిబ్బందికి ఏసీపీ రవికిరణ్ ప్రత్యేక శిక్షణనిచ్చారు. ఎన్నికల విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో మహిళా పోలీసులు నిర్వహించాల్సిన విధులపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ హనీష్ పాల్గొన్నారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని స్థానిక స్వస్తిక్ రేకుల కంపెనీలో బుధవారం ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామంలోని సహ్యాద్రి స్వస్తిక్ రేకుల కంపెనీలో కొంత కాలంగా మున్నా ప్రతాప్ పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉండగా బెల్టు అదుపుతప్పి కింద పడటంతో ప్రతాప్ తీవ్రంగా గాయపడ్డాడు. కంపెనీ యాజమాన్యం అతన్ని హుటాహుటిన విజయవాడలోని ఆస్పత్రికి తరలించింది. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

వత్సవాయి : మండలకేంద్రం వత్సవాయిలో 49మంది గ్రామవలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈమేరకు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో టీసీకేజే భరత్ రాజ్‌కు బుధవారం అందజేశారు. ఇందుగపల్లి గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు మాతంగి నరేష్, కొల్లి ఉష, రాయినూతల రమేష్, నన్నెబోయిన వీరగోపాలరావు కూడా తమ విధులకు రాజీనామా చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు):మండలంలోని సుబ్బాయిగూడేనికి చెందిన 10మంది వలంటీర్లు, గుమ్మడిదుర్రు గ్రామానికి చెందిన 18 మంది కలిపి మొత్తం 28 మంది వలంటీర్లు బుధవారం తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ సిబ్బందికి అందజేశారు.

నందిగామ మండలంలో...

నందిగామ: కేతవీరునిపాడుకు చెందిన 12మంది వలంటీర్లు, నందిగామ మండలం సోమవరంలో 8మంది, రుద్రవరం గ్రామానికి చెందిన 9మంది, దాములూరులో ఇద్దరు కలిపి మొత్తం 31మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మండలపరిషత్ కార్యాలయ ఎస్ఏ నాగలక్ష్మికి అందజేశారు.

చిల్లకల్లులో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): తొర్రకుంటపాలెంకు చెందిన 12 మంది వలంటీర్ తమ విధులకు రాజీనామా చేశారు. ఎంపీడీవో రమేష్‌బాబుకు రాజీనామాపత్రాలు అందజేశారు. ముక్త్యాల గ్రామానికి చెందిన ఓ వలంటీర్ కూడా రాజీనామా చేశారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేశా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామ నియోజకవర్గ ప్రజలకు సమర్థవంతమైన, జవాబుదారీ పాలన అందించానని ఎమ్మెల్యే, వైఎస్సాం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని పాత బైపాస్‌రోడ్డు, జంగాల కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

నందిగామ అభివృద్ధికి ప్రత్యేక కృషి..

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పట్టణంలోని అన్ని వార్డులతోపాటు రెండోవార్డులో సైతం రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. వార్డులోని అంతర్గతరోడ్లను సిమెంటురోడ్లుగా అభివృద్ధి చేయడంతోపాటు డ్రైనేజీలు నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషిచేశామన్నారు. వైఎస్సార్‌సీపీతోనే అన్నివర్గాలకు మేలు చేకూరిందని వివరించారు. నందిగామను మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశమివ్వాలని జగన్‌మోహనరావు కోరారు. ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ తానూరి రాము, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ ముఖర్జీ, జాఫర్, షేక్ మున్నా, పాకాలపాటి కిరణ్, ఓర్సు జ్వాలా, షేక్ యాకుబ్ అలీ, రాచూరి సీతారాం, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పిల్లి జయరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

జ్వరాలపై ఆందోళన వద్దు

జిల్లా మలేరియా అధికారి



నందిగామ: జ్వరాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా మలేరియా అధికారి మోతి బాబు సూచించారు. మండలంలోని లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లింగాలపాడు, చెరువుకొమ్ముపాలెం, పెద్దవరం గ్రామాల్లో ఇటీవల జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించారు. జ్వరాల కేసుల టెస్టుల రిపోర్టులు, రికార్డులు పరిశీలించడంతోపాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దోమ కాటు కారణంగా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. జ్వరం తగిలిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్రతి హెల్త్ క్లినిక్ లో అవసరమైన అన్ని టెస్టులు చేయడంతోపాటు మందులు కూడా అందజేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట లింగాలపాడు పీహెచ్‌సీ వైద్యురాలు బేబీరాణి, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తూ..మతసామరస్యాన్ని పాటిస్తూ పాలన సాగిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక కోదాడ రోడ్‌లో బి కన్వెన్షన్‌లో జగ్గయ్యపేట ఐక్య పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం పాస్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులను పాస్టర్లు ఆశీర్వదించారు. సమావేశానికి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఊర్ల భాస్కరరావు అధ్యక్షత వహించగా, విప్ ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవుల అభ్యున్నతి, సంక్షేమానికి తమ ప్రభుత్వం విశేషంగా కృషిచేసిందని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గత పాలకుల హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో.. ఈ ఐదేళ్లలో ఏస్థాయిలో అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనించాలని కోరారు. గుంటూరు–ఎన్టీఆర్ జిల్లాలను కలుపుతూ ముక్త్యాల వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి రూ.70కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. పేటకు ప్యాసింజర్ రైలు కోసం 11సార్లు తాను ఢిల్లీకి వెళ్లి రూ.1450 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని, ప్రస్తుతం డబ్లింగ్ పనులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. చిల్లకల్లు–పేటకు రూ.15 కోట్లతో రోడ్డు, సెంట్రల్ లైటింగ్, రూ.4.50 కోట్లతో పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి, హైవేపై బస్టాండ్ నిర్మాణం, రూ.4 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి, రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం ఇలా వందలాది కోట్లతో అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. క్రైస్తవుల కోసం కమ్యూనిటీ భవన్ కావాలని పాస్టర్లు కోరగా, రూ.కోటితో భవిష్యత్‌లో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ఉదయభాను హామీ ఇచ్చారు. క్రైస్తవుల కోసం స్మశాన వాటికలకు స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు దయానంద్, రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ పోలె ముత్యం, స్టేట్ సెక్రటరీ భక్త పాల్, రీజనల్ కోఆర్డినేటర్ డేవిడ్ మనోహర్, యువనాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆనందపాల్, నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి మేకల ఆనందరావు, పాస్టర్లు పణితి విజయకుమార్, జాన్‌బాబు, ప్రభుదాసు, జయరాజు, కిరణ్, ప్రవీణ్, రాజరత్నం, రాజశేఖర్, కృపానిధి వరల్డ్‌వైజ్ ఫౌండేషన్ ప్రతినిధి రెవ డాక్టర్ రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా చర్యలు : ఏసీపీ



కవాతులో పాల్గొన్న ఎస్‌ఐ సతీష్, పోలీసులు



కోనాయపాలెంలో మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్

చందర్లపాడు(నందిగామ): ఎన్నికల సమయంలో వివాదాలకుపోయి ఇబ్బందులు పడవద్దని ఏసీపీ డాక్టర్ రవికిరణ్ సూచించారు. చందర్లపాడు మండలం కోనాయపాలెంలో బుధవారం రాత్రి ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించడంతోపాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వివాదాలు చోటుచేసుకుంటే ఆ తరువాత ఎదుర్కొనే ఇబ్బందులను గ్రామస్తులకు వివరించారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖర్, చందర్లపాడు ఎస్‌ఐ ఆర్. ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు): ఎన్నికల నేపథ్యంలో కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఏసీపీ రవికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో బుధవారం రాత్రి రాజకీయపార్టీల నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ముఖ్యంగా నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉందని వివరించారు. నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, పోలీసు సిబ్బందితదిర పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ముక్త్యాల, కెఅగ్రహారం గ్రామాల్లో చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విలియంపేట, క్రిస్టియన్‌పేటల్లోని ప్రజలకు పోలీసులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించేందుకు వీలుగా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు ఎస్‌ఐలు సూర్యభగవాన్, పద్మారావు తెలిపారు.

మేలు జరిగితేనే ఓటేయండి

ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి డీబీటీ, నాన్‌డీబీటీ రూపంలో మేలు జరిగిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మేలు జరిగితే రానున్న ఎన్నికల్లో తప్పకుండా తమ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. మండలంలోని కీసరలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ , గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించామన్నారు. వలంటీర్ల వ్యవస్థను నెలకొల్పి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత చంద్రబాబు పాలన చీకటిరోజులను తలపించిందని విమర్శించారు. నందిగామలో టీడీపీ తరఫున డమ్మీ అభ్యర్థి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావును మరోసారి గెలిపించాలని కోరారు. సర్పంచి పేరం నర్సమ్మ, పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్, మాజీ సర్పంచి పరిటాల వీరభద్రరావు పాల్గొన్నారు.

జొన్నలగడ్డ చెక్‌పోస్టు తనిఖీ

నందిగామ: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిని ఉపేక్షించేది లేదని ఏసీపీ బి.రవికిరణ్ హెచ్చరించారు. జొన్నలగడ్డ సమీపంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం ఆయన ఆకస్మికం తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలను కొద్దిసేపు పరిశీలించడంతోపాటు పలువాహనాలను స్వయంగా ఆయనే తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండి ప్రతివాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా నగదు, మద్యం, విలువైన వస్తువుల రవాణాపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ హనీష్ పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో తప్పిన అగ్నిప్రమాదం



మక్కపేట(వత్సవాయి) : పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చొరవతో 20ఎకరాల్లో మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి కాకుండా కాపాడిన ఘటన బుధవారం చిల్లకల్లు–వేరా రోడ్డులో చోటుచేసుకుంది. చిల్లకల్లు–వైరా రహదారిలో రహదారి వెంబడి చెత్తకు నిప్పంటుకుని పెద్దఎత్తున మంటల చెలరేగాయి. ఈ విషయాన్ని కొందరు ప్రయాణికులు పోలీసులకు తెలియజేయడంతో జగ్గయ్యపేట సీఐ జానకీరామ్ వత్సవాయి, చిల్లకల్లు ఎస్ఐలు బి.అభిమన్యు, సతీష్‌లను అప్రమత్తం చేయడంతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు ఫైరింజన్లను రప్పించి సుమారు రెండు గంటలపాటు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న సుమారు కోతకోయని 20 ఎకరాల మొక్కజొన్న పంటతోపాటు మిర్చి మొక్కలను పెంచే షేడ్‌నెట్ నర్సరీకి అగ్నికీలలు తాకకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటూ మంటలను అదుపులోనికి తెచ్చారు. అగ్నిప్రమాదం బారినుంచి తమపంటలను కాపాడిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.